క్లుప్తంగా

ఈవీఎంలపై అవగాహన



ఈవీఎంల పనితీరుపై అవగాహన కల్పిస్తున్న జగన్నాథం

పెద్దాపురం/సామర్లకోట: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పెద్దాపురం మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఈవీఎంల పనితీరుపై ప్రజలకు అవగాహన కల్పించారు. మండల పరిషత్ సీనియర్ సహాయకుడు జగన్నాథం, మహేష్ కార్యాలయ ఆవరణలో ఓటు ప్రక్రియ, ఈవీఎంల పనితీరు, ఓటు వేసే విధానం, ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, సిబ్బంది పాల్గొన్నారు. సామర్లకోట మండల పరిధిలోని వేట్లపాలెం గ్రామంలోను, పట్టణ పరిధిలో యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌ని పోలింగ్ కేంద్రంలో పోలింగ్ అధికారులు, ఓటర్లకు ఈవీఎంలపై అవగాహన కల్పించారు.

గ్రంథాలయానికి కుర్చీల బహూకరణ



వేట్లపాలెం గ్రంథాలయానికి కుర్చీలు అందజేసిన పాలచర్ల సతీష్

సామర్లకోట: మండల పరిధిలో వేట్లపాలెం గ్రంథాలయానికి ఆ గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు పాలచర్ల వీర వెంకటనాగ రేవతి ఆధ్వర్యంలో గురువారం ఆరు కుర్చీలు బహూకరించినట్టు గ్రంథాలయాధికారి సుమతీదేవి తెలిపారు. ఇటీవల గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆమె గ్రంథాలయ అవసరాలను గమనించారన్నారు. ఈ కార్యక్రమంలో పాలచర్ల సతీష్ పాల్గొన్నారు.

మానవాళికి మార్గదర్శి క్రీస్తు



వేడుకలో మాట్లాడుతున్న దైవజనుడు జాన్ లాజరస్

పెద్దాపురం: సర్వ మానవాళికి మార్గదర్శి క్రీస్తు అని ప్రముఖ వర్తమానికులు రాజమహేంద్రవరం రాక్ చర్చి ఆఫ్ ఇండియా దైవజనుడు పి.జాన్ లాజరస్ అన్నారు. స్థానిక లూథరన్ హైస్కూల్ క్రీడా మైదానంలో గురువారం మండల పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఐక్య క్రిస్మస్ ఆరాధన నిర్వహించారు. అసోషియేషన్ అధ్యక్షుడు నంగిన శామ్యూల్ సుదీప్ అధ్యక్షతన జరిగిన వేడుకలలో లాజరస్ మాట్లాడుతూ క్రీస్తు ఆదర్శప్రాయుడన్నారు. క్రైస్తవ భక్తిగీతాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. ఉపాధ్యక్షుడు నవ జీవన రాజు, కోశాధికారి ఐ.ప్రేమరాజు, సహాయ కార్యదర్శి పి.ఆనంద్, సహాయ కోశాధికారి బి,యోసేపు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి

కొత్తపల్లి: మండలంలోని కొండెవరంలో సుడిగాలి కారణంగా ఇళ్లు దెబ్బతిన్న కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని జనసేన పార్టీ ఇన్‌చార్జి తంగెళ్ల శ్రీనివాస్ కోరారు. కొండెవరం ఇందిరా కాలనీలో సుడిగాలి కారణంగా ఇళ్లు దెబ్బతిన్న బాధిత కుటుంబాలకు గురువారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత శిక్షణ

ఏలేశ్వరం: మండలంలో కొత్త యర్రవరంలో మహిళలకు గురువారం మగ్గంపై (నేత పని) ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దివాన్ చెరువుకు చెందిన వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు 70 మంది మహిళలకు శిక్షణ ఇచ్చారు. అనంతరం మహిళలకు మగ్గం మెటీరియల్ అందజేశారు.



పిఠాపురం మండలం విరవాడలో వర్షాలకు దెబ్బతిన్న వాణిజ్య పంటలను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖాధికారి శైలజ



కొడవలిలో వచ్చిన వరదలో చిక్కుకుని చనిపోయిన బ్రాయిలర్ కోళ్లు

అంచనా వేసి.. అండగా నిలిచి...

- తగ్గుముఖం పట్టిన వరద
- క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం అంచనా వేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు
- రైతులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని భరోసా
- పంట ఒబ్బిడిలో అన్నదాతలు బిజీబిజీ

మిచాంగ్ తుపాన్ కారణంగా వాటిల్లిన పంట నష్టాన్ని అంచనా వేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. గత నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో వరి, పత్తి, అరటి పంటలు దెబ్బతిన్నాయి. గురువారం వాతావరణం తెరిపిచ్చి ఎండ కాయడంతో రైతులు పంటలను ఒబ్బిడి చేసుకుంటున్నారు. కాగా ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేస్తున్నారు. ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు ధైర్యం చెప్పి అండగా నిలుస్తున్నారు.

పిఠాపురం: తుపాను ప్రభావంతో పిఠాపురం నియోజకవర్గంలో పలు పంటలు దెబ్బతిన్నాయి. వరితో పాటు వాణిజ్య పంటలు పూర్తిగా నీట మునిగాయి. చెరువులకు గండ్లు పడి వరద ఉధృతి పెరగడంతో గొల్లప్రోలు మండలంలో పంటలకు మరింత నష్టం వాటిల్లింది. నియోజకవర్గంలోని పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో తుపాను ప్రభావం ఎక్కువగా కనిపించింది. పనలపై ఉన్న వరిపంటతో పాటు వరి కుప్పలు సైతం నీటిలో కొట్టుకుపోయాయి. చేతికందాల్సిన పంటలు తమ కళ్ల ముందే కొట్టుకుపోతుంటే రైతులు నిస్సహాయంగా చూస్తు ఉండిపోవాల్సి వచ్చింది. గొల్లప్రోలు మండలంలో 192 హెక్టార్లలో వానిజ్య పంటలు దెబ్బతిన్నట్లు ఉద్యాన శాఖ అధికారులు అంచనా వేశారు. వరి పంట సుమారు 250 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. పిఠాపురం మండలంలో పంట నష్టం తక్కువగానే ఉండడంతో స్థానిక రైతులు ఊపిరిపీల్చుకున్నారు. కొడవలిలో



గొల్లప్రోలు మండలంలోని ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

కోళ్ల ఫారంలోకి నీరు చేరడంతో సుమారు 400 కోళ్లు మృతి చెందినట్లు ఫారం నిర్వాహకుడు పీతల వెంకట నాగేశ్వరరావు తెలిపారు.

గొల్లప్రోలు మండలంలోని ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పెండెం దొరబాబు పర్యటించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

తుపాను బాధితులను ఆదుకుంటాం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- సుడిగాలి బాధితులకు నిత్యావసరాల పంపిణీ

కొత్తపల్లి: మిచాంగ్ తుపాను బాధితులను ప్రభుత్వ పరంగా అన్నివిధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని కొండెవరం ఇందిరాకాలనీలో తుపాను కారణంగా వీచిన సుడిగాలికి ఇళ్లు దెబ్బతిన్న బాధితులకు గురువారం ఎమ్మెల్యే నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుడిగాలి కారణంగా సుమారు 50 ఇళ్లకుపైగా దెబ్బతిన్నాయన్నారు. ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు అందిస్తున్నట్టు తెలిపారు. ఇళ్లు దెబ్బతిన్న వారికి మరమ్మతుల నిమిత్తం రూ.10 వేలు వారి బ్యాంక్ ఖాతాలో జమ చేస్తారన్నారు. ఇళ్లు నిర్మించుకునేందుకు రుణాలు కూడా మంజూరు చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో 22 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వగా మొదటి విడతగా 13 వేల మందికి ఇళ్లు నిర్మించుకునేందుకు గాను రుణాలు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గుబ్బల తులసీకుమార్, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, ఎస్సీ, ఎస్టీ డివిజన్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు బండి దావీదు, కొత్తపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు మారిశెట్టి సత్తిబాబు, కొండెవరం ఉప సర్పంచ్ మేడిశెట్టి శ్రీరాములు, తహసీల్దార్ జీవీఎస్ ప్రసాద్, ఎంపీడీఓ వెంకటనారాయణ పాల్గొన్నారు.



కొండెవరంలో ఇళ్లు దెబ్బతిన్న బాధితులకు నిత్యావసర సరకులు అందిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

పంటల బీమా అందేలా చర్యలు

- జాయింట్ కలెక్టర్ ఇలక్కియ
- ముంపు ప్రాంతాల్లో పర్యటన

పిఠాపురం: వర్షాలకు దెబ్బతిన్న పంటలకు బీమా కాలపరిమితి దాటిపోయినా ఇన్సూరెన్స్ అందించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలక్కియ తెలిపారు. పిఠాపురం నియోజకవర్గంలోని గొల్లప్రోలు మండలంలో గురువారం ఆమె పర్యటించారు. ముంపు బారిన పడిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా క్రాప్ ఇన్సూరెన్సు కాల పరిమితి దాటినందున రైతులకు పంట బీమా వచ్చే అవకాశం కనిపించడం లేదని, దీనిపై చర్యలు తీసుకోవాలని గొల్లప్రోలు జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు కోరారు. దీనిపై జేసీ ఇలక్కియ మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. నీట మునిగిన పంటలు, చెరువుకు పడిన గండ్లను పరిశీలించిన ఆమె తక్షణమె గండ్లు పూడ్చివేత పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పంట నష్టాన్ని అంచనా వేసి తక్షణ సహాయం అందించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆమె వెంట జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎన్.విజయకుమార్, ఈఈ రాంగోపాల్, ఏఈ పద్మావతి, మండల తుపాను సహాయక ప్రత్యేకాధికారి, కాకినాడ డీఎల్‌డీఓ నారాయణమూర్తి, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ శర్మ తదితరులు ఉన్నారు.



చేబ్రోలులో రైతులతో మాట్లాడుతున్న జేసీ ఇలక్కియ

పంట రవాణాకు మార్గం ఏర్పాటు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం వెనుక భాగంలో ఉన్న పంట భూముల నుంచి ధాన్యం రవాణా కు మార్గం ఏర్పాటు చేస్తున్నారు. 216 జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పంచారామ క్షేత్రం వెనుక నుంచి హుస్సేన్‌పురం మీదుగా పెద్దాపురం ఏడీబీ రోడ్డు లోని రాక్ సిరామిక్స్ వరకు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా బ్రిడ్జి నిర్మాణానికి గోతులు తీశారు. దాంతో ఆ ప్రాంతంలో సుమారు 800 ఎకరాల నుంచి పంట రవాణాకు మార్గం లేకుండా పోయింది. దాంతో సాక్షి దినపత్రికలో గురువారం 'పంట రవాణాకు మార్గం ఏది' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ మేరకు అధికారులు స్పందించి ధాన్యం రవాణాకు మార్గం చూ పాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. దాంతో కాంట్రాక్టరు తమ సిబ్బందితో మార్గం ఏర్పాటుకు పను లు ప్రారంభించారు. దీనిపై రైతు నేతల హరిబాబు హర్షం వ్యక్తం చేస్తూ పనులను ఆయన పర్యవేక్షించారు.

సాక్షి ఎఫెక్ట్



రైతుల పంట రవాణాకు మార్గం ఏర్పాటుచేస్తున్న కూలీలు

ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు

జగ్గంపేట: తుపాన్లు, భారీ వర్షాలు వస్తే స్థానిక పేకేటి వీరమ్మ చెరువు కాలువ పొంగి పల్లపు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని, ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం తెలిపారు. పేకేటి వీరమ్మ చెరువు కాలువను గురువారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. తుపాను ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షానికి పలు ఇళ్లలోకి నీరు చేరిందన్నారు. సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడంతో జిల్లా పంచాయతీ అధికారి కాలువను పరిశీలించారన్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, పంచాయతీ అధికారులతో కలిసి వెళ్లి ముంపు నివారణ చర్యలకు ప్రాథమిక అంచనాలు రూపొందించామని తెలిపారు.

రైతులకు అండగా ప్రభుత్వం

ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి

పెద్దాపురం: తుపాను వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని కాండ్రకోట, కట్టమూరు గ్రామాల్లో నీట మునిగిన పొలాలు, ధాన్యం రాసులకు గురువారం డీఎల్‌డీఓ ప్రసాద్, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఏఓ సంజయ్‌కుమార్, తహసీల్దార్ వి.జితేంద్ర, ఎంపీడీఓ అశోక్‌కుమార్‌లతో కలిసి పరిశీలించారు. తమది రైతు ప్రభుత్వమని వారికి కలిగిన నష్టానికి పరిహారం చెల్లిస్తుందని అన్నారు. పంట దిగుబడిపై ఆధైర్యం వద్దని, ప్రతి రైతు తమ పేర్లను ఆర్బీకేలలో నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఆయన వెంట వ్యవపాయ సలహా మండలి సభ్యులు యినకొండ వీర విష్ణుచక్రం, ఏలేటి అనంతలక్ష్మి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు, నల్లల గోవిందు, పెంటా విజయ్‌కుమార్, గంటా రామస్వామి, జోకా నానాజీ తదితరులు ఉన్నారు.

సామర్లకోట: తుపాన్ వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండల పరిధిలో నీట మునిగిన పంట పొలాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తుపాన్ హెచ్చరికలు వచ్చిన వెంటనే అన్ని శాఖల అధికారులను సీఎం జగన్ అప్రమత్తం చేశారని, ఇందులో భాగంగానే పాఠశాలకు సెలవులు ప్రకటించారని, రైతులను ఆదుకోవడానికి పంట నష్టంపై దృష్టి సారించాలని, పంట నష్టం వివరాలు సేకరించాలని అధికారులను ఆదేశించారని అన్నారు. నియోజకవర్గంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖాధికారులతో కలసి పర్యటించి పంట నష్టాన్ని గుర్తించి ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చూడాలని సూచించామన్నారు. ఎమ్మెల్యే రాజప్ప రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫల మైయిందని, జగనన్న కాలనీ ముంపునకు గురైందని ఆరోపించడం వింతగా ఉన్నదన్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా మిల్లులకు పంపామన్నారు. జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాకుండా రోడ్లు, డ్రైన్లు ఎలా వేస్తారని ప్రశ్నించారు. పట్టణ పరిధిలో భాస్కర్‌నగర్ గత 20 ఏళ్లుగా ముంపునకు గురవుతోందని దీనిపై రాజప్ప ఏం చేశారని దవులూరి ప్రశ్నించారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మండల వ్యవసాయాధికారి ఐ.సత్య, వైస్ ఎంపీపీ పేర్నిడి వెంకట్రాయుడు, సొసైటీ అధ్యక్షుడు వీరంరెడి నాని, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, రైతులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సామర్లకోట మండలంలో ముంపునకు గురైన పంటను పరిశీలిస్తున్న దొరబాబు తదితరులు



కట్టమూరులో కుళ్లిన వరి పంటను దొరబాబుకు చూపిస్తున్న రైతులు

జగన్‌తోనే రాష్ట్రం మరింత అభివృద్ధి

- హౌసింగ్ చైర్మన్ దొరబాబు
- తిరుపతిలో వై ఏపీ నీడ్స్ జగన్

పెద్దాపురం: రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపిస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని తిరుపతి గ్రామంలో గురువారం వై ఏపీ నీడ్ జగన్ నిర్వహించారు. ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో దొరబాబు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు అదనంగా పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని అందించారన్నారు. నాలుగున్నరేళ్లలో ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూర్చిన ఘనత జగన్‌కే దక్కుతుందని ఆయన అన్నారు. తొలుత పార్టీ జెండా, సంక్షేమం, అభివృద్ధి బోర్డును దొరబాబు ఆవిష్కరించారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, పెద్దాపురం, సామర్లకోట ఎంపీపీలు పెంకే సత్యవతి, బొబ్బరాడ సత్తిబాబు, శృంగార వల్లభ స్వామి ఆలయ చైర్మన్ కర్రి జగదీష్, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, తుమ్మల అచ్యుతరామయ్య, సుందరెడ్డి రాజు, కుంచే అమరావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు

మండలంలోని చదలాడ గ్రామంలో జల్‌జీవన్ మిషన్ ద్వారా సుమారు రూ.23 లక్షలతో చేపట్టే తాగునీటి పథకానికి దవులూరి దొరబాబు గురువారం భూమి పూజ చేశారు. సర్పంచ్ ఒబిలిశెట్టి అబ్బాయి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు యినకొండ వీర విష్ణుచక్రంలతో కలసి ఆయన పాల్గొన్నారు. తొలుత ఆయన స్థానిక రైతుల ధాన్యం రాశులు, కొనుగోలు కేంద్రాలు పనితీరు, ఆర్‌బికే ద్వారా రైతులు అందుతున్న సేవలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎంపీటీసీ కాశీ విశ్వనాథం, ఒబిలిశెట్టి ఆనందం, ఎంపీటీసీ గణేష్ తదితరులు పాల్గొన్నారు.



వై ఏపీ నీడ్స్ జగన్‌లో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం : జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్

కొత్తపల్లి: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని జెడ్పీటీసీ సభ్యుడు గుబ్బల తులసీకుమార్ అన్నారు. మండలంలోని ఉప్పాడలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం-2లో అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను తెలిపే డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు ప్రభుత్వం ద్వారా అందిన కిట్లను పంపిణీ చేశారు.

ఉప్పాడ సెంటర్‌లో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్, పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, ఎంపీడీఓ వెంకటనారాయణ, ఈఓపీఆర్డీ భాస్కరరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



ఉప్పాడలో ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఎస్ఈబీ దాడుల్లో నలుగురి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) పరిధిలో గురువారం నిర్వహించిన దాడుల్లో 30 లీటర్ల సారాతో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. ప్రత్తిపాడు మండలం బవురువాక గిరిజన తండాలో సారా బట్టీలపై దాడి చేసి, సారా తయారీకి సిద్ధం చేసిన 100 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. సంఘటన స్థలం నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, మోసరి సత్తిబాబుపై కేసు నమోదు చేశారు. ఒమ్మంగిలో ఐదు లీటర్ల సారాతో మొగిలి ధర్మరాజును, కిర్లంపూడి మండలం తామరాడలో పది లీటర్ల సారాతో గుత్తుర్తి వీర వెంకట సత్యనారాయణను, గోనేడలో పది లీటర్ల సారాతో తాతపూడి నాగేశ్వరరావులను అరెస్టు చేశామని వివరించారు. నిందితులపై బైండోవర్ కేసులు నమోదు చేసి, ప్రత్తిపాడు, కిర్లంపూడి తహసీల్దార్ల వద్ద హాజరు పరిచారు. ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆడేసుకుందామా..!

- ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా
- ఈ నెల 15 నుంచి సచివాలయ స్థాయిలో క్రీడా పోటీలు
- గ్రామీణ క్రీడాకారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం

పెద్దాపురం: ఏదో ఒక క్రీడలో జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారుడిగా ఎదగాలన్న కోరిక.. విద్యార్థి దశ నుంచి మనసులో ఎంతో కొంత ఉంటుంది. ఆ మేరకు అవకాశాలు, సౌకర్యాలు అందుబాటులో లేకపోవడంతో అది ఓ కలగానే మిగిలిపోతోంది. అలాంటి కలనూ నిజం చేసేందుకు అవకాశం కల్పిస్తోంది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం. ఆడుదాం ఆంధ్రా పేరిట ప్రభుత్వం చేపడుతున్న క్రీడా సంబరాలు.. గల్లీ క్రీడాకారుడిని కూడా ప్రతిభ ఉంటే అందలం ఎక్కించేందుకు సై అంటున్నాయి. ఈ నెల 15 నుంచి ఆడుదాం ఆంధ్రా (ఇది అందరి ఆట) ప్రారంభమై, వచ్చే ఏడాది జనవరి 26 వరకూ కొనసాగనున్నాయి.



సీఎం కప్ క్రీడా పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు(ఫైల్)

ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. నియోజకవర్గంలోని పెద్దాపురం, సామర్లకోట మండలాల్లో ఆయా సచివాలయాల్లో గత నెల 27 నుంచి ప్రారంభమైన రిజిస్ట్రేషన్ ప్రక్రియ చురుగ్గా కొనసాగుతోంది. గ్రామ సచివాలయం నుంచి రాష్ట్ర స్థాయి వరకూ ఈ పోటీలు నిర్వహించనున్నారు.

సంప్రదాయ క్రీడలకూ ప్రాధాన్యం

జాతీయ స్థాయితో పాటు సంప్రదాయ క్రీడలకూ అధిక ప్రాధాన్యమివ్వాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ప్రధానంగా క్రికెట్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో పోటీలతో పాటు గ్రామీణ సంప్రదాయమైన చిత్రలేఖనం, వ్యాసరచన, ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. ఈ ఐదు క్రీడలు గ్రామస్థాయిలో ఐదు రోజులు, మండల స్థాయిలో 12 రోజులు, నియోజకవర్గంలో ఐదు రోజుల పాటు నిర్వహిస్తారు. అనంతరం జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలుంటాయి. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి విజేతలకు క్రీడా పరికరాలు, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి విజేతలకు నగదు బహుమతులు అందజేస్తారు. ప్రతి వాలీబాల్ జట్టులో 12 మంది, కబడ్డీలో 12, ఖోఖోలో 15, బ్యాడ్మింటన్‌లో ఇద్దరు వంతున క్రీడాకారులుంటారు. క్రీడాకారులు ఆసక్తి చూపిస్తే యోగా, టెన్నికాయిట్, 3కే మారథాన్, గ్రామీణ సంప్రదాయ క్రీడలనూ నిర్వహిస్తారు.

ఆన్‌లైన్‌లో వివరాల నమోదు

నియోజకవర్గంలోని పెద్దాపురం, సామర్లకోట అర్బన్, రూరల్ పరిధిలోని వార్డు, గ్రామ సచివాలయాల్లో గత నెల 27 నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే క్రీడాకారుల జాబితాలను ఆయా సచివాలయాల వలంటీర్లు రూపొందించారు. 15 ఏళ్లు పైబడిన బాల, బాలికలు, మహిళలు, పురుషులు నుంచి సీనియర్ సిటిజన్లను సైతం పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించారు. నాణ్యత, విలువైన క్రీడా సామగ్రి ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాలకు చేరుకున్నాయి. మండల స్థాయిలో ఎంపికైన వారికి టీషర్ట్, క్యాప్, రిస్ట్ బ్యాండ్, జిల్లా, రాష్ట్ర స్థాయి విజేతలకు రూ.5 లక్షల వరకు నగదు బహుమతి, ట్రోఫీ, మెడల్స్ అందించనున్నారు. పోటీల నిర్వహణకు అన్ని స్థాయిల్లోనూ కమిటీలు ఏర్పాటు చేశారు.



ఆడుదాం ఆంధ్రా క్రీడా సామగ్రిని అందజేస్తున్న వైస్ చైర్మన్ సాయిప్రసాద్

క్రీడలకు ప్రాధాన్యం



ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నాం. గ్రామీణ స్థాయి నుంచి అన్ని వయస్సుల వారికి నిర్వహిస్తున్న పోటీల ద్వారా ప్రజల్లో క్రీడలపై ఆసక్తి పెరుగుతుంది. దీని ద్వారా గ్రామాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంటుంది.

– దేవాడ సంతోష్, ఖోఖో సీనియర్ క్రీడాకారుడు, తాటిపర్తి, పెద్దాపురం మండలం

ఉజ్వల భవిష్యత్తుకు దోహదం



గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో క్రీడా పోటీలు నిర్వహించడం వల్ల యువతలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు వీలుంటుంది. క్రీడల్లో రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటవచ్చు. ఈ క్రీడలు యువత ఉజ్వల భవిష్యత్తుకు ఎంతగానో దోహదపడతాయి.

– శర్మ, ఎంఈఓ, పెద్దాపురం

రిజిస్ట్రేషన్ వేగవంతం



సచివాలయ స్థాయిలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేశాం. వలంటీర్లు ఫోన్‌లో ఆడుదాం ఆంధ్రా యాప్‌లో వివరాలను నమోదు చేస్తారు. ఈ ప్రక్రియపై ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లకు అవగాహన కల్పించాం. ప్రభుత్వం ఇచ్చిన షెడ్యూల్డ్ ప్రకారం పోటీలను నిర్వహిస్తాం.

– బి.అశోక్‌కుమార్, ఎంపీడీఓ, పెద్దాపురం